## క్లుప్తంగా

### నేడు వాడపల్లిలో 'తలారి' ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ఆదివారం సాయంత్రం మూడు గంటల నుంచి మండలంలోని వాడపల్లి గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తారని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ శనివారం తెలిపారు. కావున నియోజకవర్గంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

### అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి వారు

పెరవలి: అన్నవరప్పాడులో కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను పురోహితులు వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధాన చేశారు. అన్న సమారాధనలో 5 వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. వేసవి కావడంతో ఆలయంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

### వాహన తనిఖీలు ముమ్మరం చేయాలి



జగన్నాథపురం వద్ద సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న రోహిత్ నగర్

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రోహిత్ నగర్ అన్నారు. గోపాలపురం మండలం జగన్నాథపురంలో జిల్లా సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ ప్రతి వాహనాన్నీ నిశితంగా తనిఖీ చేయాలని అక్కడి సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం గోపాలపురరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రికార్డులను రోహిత్ నగర్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, ట్రైనీ కలెక్టర్ కె.సువర్ణ, నియోజకవర్గ వ్యయ పరిశీలకులు కె సుబ్బారావు, తహసీల్దార్ డి.వనజాక్షి, డీటీ సాకే కృష్ణ వెంట ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొవ్వూరు: గామన్ ఇండియా వంతెనపై శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజానగరానికి చెందిన పలివెల కరుణకుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కరుణకుమార్ కొవ్వూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీ కొట్టింది. దీంతో కరుణకుమార్‌తో పాటు ఎదురుగా వచ్చిన మరో మోటారు సైకిల్ నడిపే వ్యక్తికి కూడా తీవ్ర గాయాలైనట్టు కొవ్వూరు టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. క్షతగాత్రుడు కరుణకుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

### యాదవ సంఘం అధ్యక్షుడిగా 'గంగుల'

నిడదవోలు: నిడదవోలు నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడిగా గంగుల గోపీయాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చవల సూర్యచంద్రం శనివారం గంగులకు నియామక పత్రాన్ని అందజేశారు.

# సంక్షేమానికే మళ్లీ పట్టం కడదాం



చాగల్లు ప్రచారంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- చాగల్లులో ఇంటింటా ఎన్నికల ప్రచారం
- హారతులు పట్టిన మహిళలు

చాగల్లు: గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే ప్రస్తుత ఎన్నికల్లో మరోసారి ఆయనను గెలిపిస్తాయని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. ప్రజాశీర్వాద కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి చాగల్లులో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. స్థానిక మహిళలు హారతులు ఇచ్చి తలారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రకులాల్లోని పేదలను ఆదుకున్నారన్నారు. మేలు పొందిన వర్గాల వారంతా మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని నిర్ణయించుకున్నారన్నారు. అందువల్లే మునుపెన్నడూ లేని విధంగా మేమంతా సిద్ధం సభలకు, బస్సుయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి జగన్‌కు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీటీసీ సభ్యులు ఉన్నమట్ల విజయకుమారి, గేడా శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు



విజ్జేశ్వరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు

- మళ్లీ ఆయననే గెలిపించుకుందాం
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- విజ్జేశ్వరం, గోపవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆ పార్టీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని విజ్జేశ్వరం, గోపవరం గ్రామాల్లో శ్రీనివాస్‌నాయుడు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, మద్దతుదారులతో కలసి వీధివీధికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఇసుక రవాణా కూలీలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు హామీ ఇచ్చారు. విజ్జేశ్వరం, గోపవరం గ్రామాలను మరింతగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత పురోభివృద్ధిలోకి తీసుకు వెళ్తామన్నారు. ఈ ప్రచారంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ రాష్ట్ర నాయకుడు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి నాయకులు యాళ్ల రామారావు, ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, తోలేటి శ్రీను, దేవన బాబూరావు, తాతపూడి నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు పాల్గొన్నారు.

### 1 నుంచి ఉచిత యోగా, చెస్ శిక్షణ

నల్లజర్ల: స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దూబచర్లలో మే1 నుంచి 31 వరకూ యోగా, చెస్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని దూబచర్ల జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ దూబగుంట్ల రాజారావు శనివారం తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 7నుంచి 8 గంటల వరకు చెస్‌లో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. పరిసర గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కానూరులో బేటీ బచావో - బేటీ పఢావో

పెరవలి: మండలంలోని కానూరు ఉన్నత పాఠశాలలో శనివారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి మాట్లాడుతూ యుక్త వయసు బాలికల్లో శరీర మార్పులు వచ్చేటపుడు అనేక రకాల ఇబ్బందులు ఉంటాయన్నారు. వాటిని అధిగమించేందుకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థినులకు ఏదైనా సమస్య వచ్చినపుడు ముందుకు క్లాస్ టీచర్‌కు చెప్పి తరువాత తల్లి దండ్రులకు, అంగన్‌వాడీ టీచర్లకు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పోతవరంలో 44 మంది వలంటీర్ల రాజీనామా



పోతవరంలో రాజీనామా పత్రాలను కార్యదర్శి మెస్సే రాజుకు అందిస్తున్న వలంటీర్లు

నల్లజర్ల: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. పోతవరం-1, 2 సచివాలయాల పరిధిలోని 44 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి మెస్సే రాజుకు అందజేశారు. సోమవారం పుల్లలపాడు, జగన్నాథపురం వలంటీర్లు 24 మంది రాజీనామా చేయగా మంగళవారం ఘంటావారిగూడెంలో 11 మంది, ప్రకాశరావుపాలెం పరిధిలోని 19 మంది రాజీనామాలు సమర్పించారు. వారు తమ రాజీనామా లేఖలను కార్యదర్శులకు అందజేశారు. పోతవరంలో శనివారం రాజీనామా చేసిన వారిలో ఆరేటి సోమశేఖరం, శివ, గ్రంధిపాం ఈశ్వరి, ప్రత్తిపాటి చిరంజీవి, కంకట రాజేష్, ముప్పిడి స్వాతి మాట్లాడుతూ ఐదేళ్లుగా కులమత,పార్టీల భేదం లేకుండా నిష్పక్షపాతంగా ప్రజలకు సేవలు చేస్తున్నామన్నారు. అలాంటి తమను కించపరుస్తూ, నిందలు వేసిన కూటమి నేతల వైఖరికి నిరసనగా తామంతా రాజీనామాలు చేసినట్టు వెల్లడించారు. ఇప్పుడు తమకు జగనన్న రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. తప్పకుండ ఆయన తరఫున ఊరూర ప్రచారం చేసి జగనన్నను మరోసారి సీఎం చేసుకుంటామన్నారు.

# కూటమిని నమ్ముకుంటే కష్టాలే



కరిచర్లగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత

- ఆ పార్టీల నాయకులకు వారిపైనే నమ్మకం లేదు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత
- మూడు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం

గోపాలపురం: తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమిని నమ్మితే నట్టేట ముంచుతాయని వైఎస్సార్ సీపీ గోపాలపురం అసెంబ్లీ అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఆ మూడు పార్టీల నాయకులకు వారిపైనే నమ్మకం లేక కూటమి పేరుతో గుంపుగా వస్తున్నారని విమర్శించారు. గోపాలపురం మండలం కరిచర్లగూడెం, చెరుకుమిల్లి, చిట్యాల గ్రామాల్లో శనివారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కూటమి పేరుతో కలిసి వచ్చే పార్టీలను నమ్మవద్దని ఆమె ఓటర్లకు హితవు పలికారు. గత ఐదేళ్లలో మీ కుటుంబానికి మేలు జరిగితేనే ఓటు వేయండని అడిగిన మొట్ట మొదటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని మంత్రి వనిత అన్నారు. ఓటర్లు ఆలోచించి రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి గోపాలపురం ఎమ్మెల్యేగా తనను, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ నాయకులు పఠాన్ అన్సర్ బాషా, వెలగా శ్రీరామమూర్తి, ఎస్‌కే వల్లీ, పీతల ప్రసాద్‌బాబు, ముళ్లపూడి వివేక్, ముచ్చికర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# రెండో సెట్ నామినేషన్ దాఖలు



ఆర్వో వెంకటరమణ నాయక్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



కొవ్వూరులో రెండో సెట్టు నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

నిడదవోలు: వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు శనివారం స్థానిక ఆర్వో కార్యాలయంలో రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే అదే పార్టీ తరఫున ఎమ్మెల్యే సతీమణి గెద్దం సుమలత కూడా నామినేషన్ దాఖలు చేశారు. వారిరువురూ తామ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణనాయక్‌కు అందజేశారు.

**తలారి రెండో సెట్ నామినేషన్ దాఖలు**

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తలారి వెంకట్రావు శనివారం రెండో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవకు అందజేశారు. అలాగే టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత ఆ పార్టీ తరఫున శనివారం తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# క్షతగాత్రులకు మంత్రి వనిత పరామర్శ

కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా



రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను శనివారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. నల్లజర్ల మండలం వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం స్కూటీ కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో నల్లజర్ల యువకులు ముగ్గురు గాయపడ్డారు. వీరిలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కలపాల గణేష్‌ను తొలుత పరామర్శించారు. పోతవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిర్యాల రాంబాబు, దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురుకూరుకు చెందిన పల్లపు అబ్బులును కూడా మంత్రి పరామర్శించారు. ఆయా ఆసుపత్రుల వైద్యులతో మంత్రి వనిత మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆమె సూచించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. క్షతగాత్రుల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు తెలుసుకుని తనకు సమాచారం ఇవ్వాలని ఆమె పార్టీ నాయకులకు సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి సతీష్, కారుమంచి రమేష్, కుసులూరి వెంకట సతీష్, సాలి వేణు, పలువురు నాయకులు మంత్రి వనిత వెంట ఉన్నారు.



# వైఎస్సార్ సీపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



నిడదవోలు బసివిరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: అందరికీ మంచి చేసే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. ఆయనను మళ్లీ అదే స్థానంలో కొనసాగాలంటే మీ అందరి ఆశీర్వచనాలు కావాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి పట్టణంలోని 12వ వార్డు బసివిరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ గెలుపునకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు మేడపాటి సరితాదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, పువ్వుల రతిదేవి, పార్టీ నాయకులు ఎస్‌కే ఛాన్‌బాషా, గంగుల గోపీయాదవ్, అడపా రాజు, తోలేటి కోటి, అడపా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరంలో బూరుగుపల్లి సుబ్బారావు**

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరఫున జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు శనివారం సాయంత్రం ఉండ్రాజవరంలోని లింగాల పేట, ఆరుంధతీయ పేటలలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి నిడదవోలు ఎమ్మెల్యేగా జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, సొసైటీ అధ్యక్షుడు సంకురాత్రి సుబ్బారావు, కరికాల బత్తుల కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ల మంగాదేవి, కరెళ్ల సోమేశ్వరరావు, నిమ్మన వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**నిడదవోలు మండలంలో..**

నిడదవోలు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడులకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. తిమ్మరాజుపాలెంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, సమిశ్రగూడెంలో పార్టీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, కంసాలిపాలెంలో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, తాళ్లపాలెంలో సొసైటీ అధ్యక్షుడు గంధం వెంకటరత్నం (షావుకారు) ఆధ్వర్యంలో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలని కోరారు. కస్తూరి సాగర్, రాజు, కొత్తపల్లి సత్యనారాయణ, దేశాబత్తుల నాగు, వదలి అంబేడ్కర్, బట్టు వెంకటరత్నం,గెడ్డం రవీంద్ర, ఆరుగొలను రమేష్, షేక్ రహీం, సయ్యద్ బాజీ, నజీరుద్దీన్‌ఖాన్, నల్లమాటి నరేంద్ర పాల్గొన్నారు.

### నా తండ్రిని మరోసారి గెలిపించండి



ఖండవల్లిలో తండ్రి శ్రీనివాస్‌నాయుడి తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుణ్ సాయి

పెరవలి: నిడదవోలు నియోజకవర్గాన్ని గత ఐదేళ్లలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు కోట్లాది రూపాయలతో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశారని ఆయన కుమారుడు వరుణ్ సాయి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఖండవల్లి గ్రామంలో శనివారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున నిడదవోలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన తండ్రి శ్రీనివాస్ నాయుడిని మరోసారి ఆశీర్వదించాలన్నారు కోరారు. ప్రచారంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లేటి రవి, మెరిపే జోసెఫ్, కుసుమే సూరిబాబు, వాసంశెట్టి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో జిల్లా ఎన్నికల పరిశీలకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకులు నితిన్ కురైన్ (ఐఆర్ఎస్), రోహిత్ నగర్ (ఐఆర్ఎస్)లు శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేష వస్త్రాలను కప్పి వేదాశీర్వచనాన్ని పలికారు. ఆ తరువాత స్వామివారి జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు.